టాప్ న్యూస్



## ఢిల్లీలో రామచంద్ర
- బిజెపి హైకమాండ్ షాకులు

02



## బీఆర్ఎస్ గెలిచేది లేదు చచ్చేది లేదు
- కవితక్క అప్ డేట్స్ సంచలనం

02



## ఏ కోర్టుకు వెళ్ళినా 50% దాటదు
- పాత పద్ధతిలో ఎన్నికలు బెటర్
- స్థానికంపై సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

02



కంది రామచంద్రారెడ్డి
*వీకెండ్ అనాలసిస్*

ANN తెలుగు
Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
12-10-2025
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 307 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD
ఆదివారం
WWW.EPAPER.MAHAADAILY.COM

### బీసీ రిజర్వేషన్లు.. రాజకీయాలు

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి బీసీ రిజర్వేషన్ల అంశం హాట్ టాపిక్‌గా మారింది. కేంద్రం చేతుల్లోనే పరిష్కారం ఉండటంతో రాష్ట్ర స్థాయి రాజకీయాలు గందరగోళంగా మారాయి. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడమే బీసీ రిజర్వేషన్లకు స్థిర రక్షగా న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల అనుభవాలను పరిశీలిస్తే, జీవోలు, బిల్లులతో మాత్రమే ప్రయోజనం లేదనే స్పష్టత వచ్చింది. బీహార్, మధ్యప్రదేశ్, మహా రాష్ట్ర వంటి చోట్ల అనేక ఉదాహరణలు కళ్ళముందు సాక్షాత్కరిస్తాయి. ఎమ్మార్పీఎస్ లాంటి ఉద్యమ పంథాతోనే జాతీయస్థాయిలోనే బీసీ రిజర్వేషన్ల అంశం పరిష్కారమవుతుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీ సంఘాలు ఈనెల 14న బంద్ కు పిలుపునిచ్చాయి. బీసీల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయగలిగిందంతా చేసింది. మళ్ళీ సుప్రీంకోర్టు మెట్లెక్కాలని రాష్ట్ర సర్కారు నిర్ణయానికొచ్చింది. బీసీ రిజర్వేషన్ల అశంపై వేడి చర్చ ఓ వైపు సాగుతుండగా, మరోవైపు జూబ్లీహిల్స్ బైపోల్ ప్రధాన పార్టీలకు పరీక్షగా ఉంది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ , బిఆర్ఎస్ ల మధ్య బలమైన పోటీ జరుగుతోంది. కాంగ్రెస్ సరైన స్థానిక అభ్యర్థిని ఎంపిక చేయగా, బిజెపి అభ్యర్థి కూడా కీలకంగా మారనున్నారు.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో ▸

SRI GOLD
TRUSTED GOLD BUYERS

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,25,080 |
| 22 క్యారెట్ | 1,14,650 |
| సిల్వర్ (కేజీ) | 1,77,000 |

# సుప్రీం బాట

## బీసీ రిజర్వేషన్లపై సర్కార్ తగ్గేదెలే...

### హైకోర్టు స్టేపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసే ఛాన్స్
### సుప్రీంకోర్టుకు వెళ్లే అంశంపై కాంగ్రెస్ నేతలు జూమ్ సమావేశం
### రిజర్వేషన్ల అమలుకు మూడు ఆప్షన్లపై చర్చ
### సోమవారం లేదా ఈనెల 15న కేబినెట్ భేటీలో నిర్ణయం



**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలను చివరిదాకా చేయాలని డిసైడైంది. హైకోర్టు నిర్ణయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర సర్కారు నిర్ణయానికొచ్చింది. జీవో 9 అమలు చేయాలని సుప్రీంకోర్టుకు వెళ్లే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, ఏఐసీసీ ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి సహా ముఖ్య కాంగ్రెస్ నేతలు జూమ్ సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో కాంగ్రెస్ నేతలు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించింది. దీనిపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయనుంది. హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికల నిర్వహణకు అనుమతించాలని కోరనుంది. ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైనందున ఇందులో హైకోర్టు జోక్యం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించనుంది. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా జనాభా గణాంకాలపై సర్వే నిర్వహించి, బీసీ జనాభా 57.6 శాతం ఉన్నందున 42 శాతం రిజర్వేషన్లు కల్పించామని, దీనికి అనుగుణంగా రిజర్వేషన్‌ల పరిమితిని సవరిస్తూ చట్టం చీసుకువచ్చిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లనుంది.

మిగతా 2లో ▸



# తెలంగాణ ఐకానిక్‌గా టీస్క్వేర్

## నవంబర్ చివరికల్లా పనులు ప్రారంభించాలి

- యాపిల్ లాంటి దిగ్గజ సంస్థలు వ్యాపారం నిర్వహించేలా ఉండాలి
- రాయదుర్గం ప్రాంతంలో అత్యంత ఆకర్షణీయంగా నిర్మాణం
- అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలో ఐటీ కంపెనీలకు కేంద్రమైన రాయదుర్గం ప్రాంతంలో అత్యంత ఆకర్షణీయంగా టీస్క్వేర్ నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా అన్ని హంగులతో ఒక ఆకర్షణీయమైన కేంద్రంగా ఉండాలని, నవంబర్ నెలాఖరు నాటికి ఆ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఐసీసీసీలో మంత్రి శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఏఐ హబ్, టీస్క్వేర్ నిర్మాణంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ రెండు ప్రాజెక్టులపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అదికారులకు పలు సూచనలు చేశారు.

మిగతా 2లో ▸



## చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్

### సీఎంగా 15 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు ప్రత్యేక అభినందనలు

**అమరావతి, మహా**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న

మిగతా 2లో ▸



## ఫార్ములాఈ రేస్‌తో గ్లోబల్ మొబిలిటీ హబ్‌గా హైదరాబాద్

- త్వరలో భారత 'మొబిలిటీ వ్యాలీ'గా హైదరాబాద్ ఆవిర్భావం
- టీహబ్, టీవర్క్స్' తెలంగాణ ఆవిష్కరణలకు జంట స్తంభాలు
- కోయంబత్తూరులో జరిగిన ఎఫ్ఎంఏఈ కార్యక్రమంలో కేటీఆర్

వివరాలు 2లో ▸

| స్టాక్ మార్కెట్ | | |
|---|---|---|
| సెన్సెక్స్ | ↗ | 82,500.82 |
| నిఫ్టీ | ↗ | 25,285.35 |

### హైకోర్టు స్టేపై సుప్రీంకోర్టుకు
# అప్పీల్ చేస్తాం

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం: టీపీసీసీ చీఫ్

### బనకచర్ల విషయంలో అంత చేసింది మీరే.. రాయలసీమను రతనాల సీమ చేస్తా అన్నది కేసీఆర్ కాదా? అంటూ వ్యాఖ్య

**హైదరాబాద్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలుపై హైకోర్టు స్టే ఇచ్చినందున సుప్రీంకోర్టుకు వెళ్లి అప్పీలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అక్కడ వెసులు బాటు దొరుకుతదని ఆశిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు ఆపటంలో అసలైన ముద్దాయి బీజేపీ అని విమర్శించారు. బీజేపీ, బీఅరెస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గవర్నర్ దగ్గర బిల్లుని పెండింగ్‌లో ఉంచారని, గవర్నర్‌ను నియమించేది ఎవరు? అని ప్రశ్నించారు. మూడు చట్టాలు ఒక ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు.



**ఒక్క నీటి చుక్కను వదులుకునే ప్రసక్తే లేదు..**

బీసీలకు నోటి దాకా వచ్చిన ఫలాలను అడ్డుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా 2లో ▸



## మీకు 48 గంటల టైమ్ ఇస్తున్నా..

### పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ డెడ్‌లైన్

**మంచిర్యాల, మహా :** ఓ మహిళలను కులం పేరుతో దూషించాడని మంచిర్యాల జిల్లా వేమనపల్లి బీజేపీ మండలాధ్యక్షుడు ఏట మధుకర్ పై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీంతో అతడు ఆ అవమానాన్ని భరించలేక సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మిగతా 2లో ▸

| ఈరోజు గుడ్డు ధరలు | | |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | | |
| 1 పీస్ | | ట్రే |
| 5.2 | ₹ | 156 |
| హోల్ సేల్ గుడ్డు ధర | | |
| 1 పీస్ | | ట్రే |
| 5.2 | ₹ | 156 |
| రిటైల్ గుడ్డు ధర | | |
| 1 పీస్ | | ట్రే |
| 5.51 | ₹ | 165.36 |


| ఈరోజు చికెన్ ధరలు | | |
|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర ₹ | | |
| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
| 180 | 220 | 230 |
| హోల్ సేల్ ధర ₹ | | |
| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
| 160 | 200 | 210 |


## అమరావతి రైతులకు ప్రభుత్వం తీపికబురు

### రేపు సిఆర్‌డిఏ కార్యాలయం ప్రారంభం

**అమరావతి, మహా:** ప్రజా రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు, భూ యజమానులకు చెల్లించాల్సిన వార్షిక కౌలును ఏపీ సీఆర్డీఏ (ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ) రైతుల బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేసింది. సాంకేతిక సమస్యలు, ప్లాట్ల అమ్మకాలు, మరణించిన రైతుల వారసుల వివరాలు అందకపోవడం వంటి కారణాలతో

మిగతా 2లో ▸





ANN తెలుగు
మహా పత్రిక 02
ఆదివారం, తిరుపతి | 12-10-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# ఫార్ములా-ఈ రేస్‌తో గ్లోబల్ మొబిలిటీ
# హబ్‌గా హైదరాబాద్

## త్వరలో భారత మొబిలిటీ వ్యాలీగా హైదరాబాద్ ఆవిర్భావం
### టీహబ్, టీవర్క్స్' తెలంగాణ ఆవిష్కరణలకు జంట స్తంభాలు
### కోయంబత్తూరులో జరిగిన ఎఫ్ఎంఏఈ కార్యక్రమంలో కేటీఆర్

**కోయంబత్తూరు, మహా:** తొలిసారిగా హైదరాబాద్‌లో తాము నిర్వహించిన ఫార్ములా ఈ రేసు కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదని, ఆవిష్కరణలు, క్లీన్ మొబిలిటీ, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణ కేంద్రంగా ప్రపంచ వేదికపై అడుగుపెట్టిందనడానికి ప్రతీక అని కేటీఆర్ స్పష్టం చేశారు. శుక్రవారం కోయంబత్తూరులో జరిగిన 10వ ఎఫ్ఎంఏఈ పోటీలు 2025కి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా, దేశంలోని యువ ఇంజనీర్లు, ఆవిష్కర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఎలక్ట్రిక్ కార్లు హైదరాబాద్ వీధుల్లో పరుగెత్తినప్పుడు, భవిష్యత్తు కోసం తెలంగాణ సిద్ధంగా ఉందని రుజువైంది. ఈ రేసు దాదాపు రూ. 700 కోట్ల ఆర్థిక కార్యకలాపాన్ని సృష్టించి, అంతర్జాతీయ దృష్టిని హైదరాబాద్ వైపు మళ్లించింది" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఫార్ములా ఈ ఈవెంట్ ఒక ఆరంభం మాత్రమేనని, తెలంగాణ స్థిరమైన, సాంకేతికత ఆధారిత పారిశ్రామిక వృద్ధి లక్ష్యాన్ని కలిగి ఉందని, త్వరలోనే హైదరాబాద్ భారతదేశ మొబిలిటీ వ్యాలీ'గా ఆవిర్భవించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మోటార్‌స్పోర్ట్స్ అంటే కేవలం వేగం కాదు; అది తమ సామర్థ్యాలను పరీక్షించుకోవడం, హద్దులను ఛేదించడం, ఎంత దూరం వెళ్లగలమో తెలుసుకోవడం అని, జీవితంలో యువత కూడా రేసు కారు మాదిరి దూసుకుపోవాలని కేటీఆర్ అన్నారు. ఐటీ మంత్రిగా తన హయాంలో, ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన టీహబ్, భారతదేశంలోనే అతి పెద్ద ప్రోటోటైపింగ్ కేంద్రమైన టీవర్క్స్ వంటి సంస్థల ద్వారా తెలంగాణ అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను ఎలా నిర్మించిందో కేటీఆర్ వివరించారు. "ఒక ఆలోచన టీహబ్ నుండి టీవర్క్స్‌కు వెళ్లడానికి ఒక టీ తాగేంత సమయం మాత్రమే పడుతుంది" అంటూ ఆలోచన అమలు వేగాన్ని చమత్కరించారు.

**యువత ఉద్యోగాలు సృష్టించాలి**

వందలాది మంది యువ ఇంజనీర్లకు సందేశమిస్తూ, అవకాశాల కోసం ఎదురుచూడకుండా, వాటిని మీరే సృష్టించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. "మీరు సొంతంగా ఒక క్యూను సృష్టించగలిగినప్పుడు, ఇతరులు ఏర్పాటు చేసిన క్యూలో ఎందుకు నిలబడాలి?" అని ప్రశ్నించారు. "ఉద్యోగాలు వెతికేవారుగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారుగా మారండి. మీరు పెద్ద కలలు కనడం ప్రారంభించిన తర్వాత, మీ సొంత సామర్థ్యాన్ని చూసి మీరే ఆశ్చర్యపోతారు" అని ఆయన ఉద్బోధించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయాణాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు రాష్ట్ర ఏర్పాటు సాధ్యం కాదని చాలామంది సందేహించారని, కానీ, "ఇప్పుడు 11 సంవత్సరాల తర్వాత, అనేక రంగాలలో దేశానికి ఆదర్శంగా నిలబడ్డాము. తెలంగాణ సాధించిన ప్రగతి విశ్వాసానికి పట్టుదలకు దర్శనీకత నిదర్శనం అన్నారు. నేటి యువతరం, జెన్ జెడ్ కు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తూ, కేటీఆర్... ఆదాయం కంటే ప్రభావానికి, అధికారం కంటే ప్రామాణికతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వేగం, విస్తరణ పట్ల ఆకలిని కలిగి ఉండాలని సూచించారు. మీరు ఇతరులు అనుకున్నదాని కంటే తెలివైనవారు, బాధ్యత కలిగినవారు. భారతదేశాన్ని ముందుకు నడిపించేది మీరే" అని విద్యార్థులకు తెలిపారు. మోటార్‌స్పోర్ట్స్ అయినా, పాలన అయినా, జీవితంలో అయినా విజయం కేవలం యాదృచ్ఛికంగా రాదని, "మనం మన అవకాశాలను రూపొందించుకోవాలి, ధైర్యంతో అమలు చేయాలి. అప్పుడే భవిష్యత్తు నిర్మితమవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.

## ఢిల్లీలో రామచంద్ర
### బిజెపి హైకమాండ్ షాకులు

**ఢిల్లీ, మహా :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భాగంగా బీజేపీ అభ్యర్థిని ఖరారు చేసేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. పార్టీ జాతీయ నేతలైన బీఎల్‌సంతోష్, సున్నీల్ భన్సల్‌తో సమావేశమై త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక అందజేశారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు చర్చించిన అనంతరం అభ్యర్థి ప్రకటన ఉంటుందని తెలిసింది. కమిటీ ఇచ్చిన నివేదికలో లంకల దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ పేర్లు ఉన్నట్లు పార్టీలో టాక్. వీరు ఇప్పటికే నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారు. ఇక రాష్ట్రకమిటీలో ఆఫీస్ బేరర్ల పెంపుకు అనుమతి కోరగా, నో చెప్పడంతో పాటు అధికార ప్రతినిధుల సంఖ్యను కూడా కుదించమని సూచించినట్లు సమాచారం. .హైకమాండ్ రామచంద్ర రావు ప్రతిపాదనను తిరస్కరించి డబుల్ షాక్ ఇచ్చిందని పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది.

## బీఆర్ఎస్ గెలిచేది లేదు చచ్చేది లేదు
### కవితక్క అప్ డేట్స్ సంచలనం

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ పార్టీపై మరోసారి కవిత టీమ్ సంచలన కామెంట్స్ చేసింది. బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచేది లేదు చచ్చేది లేదంటూ చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.రోజుకు ఒక అప్డేట్ తో వస్తే చచ్చిపోతారు అన్ని మూసుకొని మీ పనులు మీరు చేసుకోవాలంటూ బీఆర్ఎస్ శ్రేణులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన అనంతరం ఆమెపై బీఆర్ఎస్ నేతల నుండి వచ్చే విమర్శలకు కవిత టీమ్ కవితక్క అప్ డేట్స్ నుండే గట్టి కౌంటర్ ఇస్తున్నారు.

## మీకు 48 గంటల టైమ్ ఇస్తున్నా..
### పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ డెడ్‌లైన్

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలోనే మధుకర్ కుటుంబాన్ని ఇవాళ పరామర్శించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ నీల్వాయ్‌కి వెళ్లారు. కుటుంబ దుస్థితి, కాంగ్రెస్ నేతల వేధింపులు, పోలీసుల అరాచకాలను వివరిస్తూ మధుకర్ కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టారు. ఆ మాటలు విని చలించిపోయిన బండి సంజయ్ బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా బీజేపీ ఆదుకుంటుందని భరోసానిచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మధుకర్ ఆత్మహత్యకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేయాలని.. అందుకు పోలీసులకు 48 గంటల సమయం ఇస్తున్నానని డెడ్‌లైన్ పెట్టారు. మధుకర్‌ను వేధించిన పోలీసు అధికారులను కూడా సస్పెండ్ చేయాల్సిందేనని అన్నారు. లేని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కు మించి కాంగ్రెస్ అరాచకాలు కొనసాగుతున్నాయని కామెంట్ చేశారు. నక్సలైట్ల తూటాలకే భయపడని తెగింపు బీజేపీ కార్యకర్తలదని.. కాంగ్రెస్ అరాచకాలను ఎదిరిస్తామని ఫైర్ అయ్యారు.



## సుప్రీం బాట

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టు తీర్పు కాపీ శుక్రవారం అర్ధరాత్రి వచ్చింది. ఒకవేళ ఆ కాపీ వచ్చినా రాకపోయినా, మినహాయింపు కోరుతూ అత్యవసరంగా స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టును కోరే అవకాశాలు ఉన్నాయి. అయితే సుప్రీంకోర్టుకు వెళ్లడమా? లేదా బిల్లులు క్లియర్ చేసేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అంశంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడే వరకు వేచి చూడటమా? లేదా పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇవ్వడమా అనే మూడు ఆప్షన్లపై ప్రభుత్వం చర్చించినట్లు తెలుస్తోంది. అయితే చివరకు సుప్రీంకోర్టుకు వెళ్లడమే మేలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సోమవారం సుప్రీంకోర్టుకు వెళ్కాలా.. ఈనెల 15న కేబినెట్ సమావేశం ఉన్న నేపథ్యంలో మరోసారి చర్చించి సుప్రీంకోర్టుకు వెళ్కాలా అన్న అంశం ఖరారుచేయనున్నారు. మరోవైపు రిజర్వేషన్ల జీవో 9ను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన బి.మాధవరెడ్డి, మరొకరు సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేశారు. రిజర్వేషన్‌లకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎవరైనా అప్పీలు దాఖలు చేస్తే తమ వాదన వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వరాదని అభ్యర్థించారు.

## ఏ కోర్టుకు వెళ్ళినా 50శాతం దాటదు
### పాత పద్ధతిలో ఎన్నికలు బెటర్
### స్థానికంపై సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికల నిర్వహణపై సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ స్పందించారు. రిజర్వేషన్ల విషయంలో 50 శాతానికి మించి ముందుకు వెళ్తే దేశంలోని ఏ కోర్టు అయినా అడ్డుపడుతుందని అన్నారు. రాజ్యాంగం, దేశ అత్యున్న న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలను అధిగమించితే తప్పులు దొర్లే అవకాశం ఉందని కామెంట్ చేశారు. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వం పాత పద్ధతిలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే మంచిదని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై ఇచ్చిన జీవోపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో సుప్రీంకోర్టుకు



వెళ్లినా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మరింత ఆలస్యం చేస్తే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు.

## అమరావతి రైతులకు ప్రభుత్వం తీపికబురు
### రేపు సిఆర్ డిఏ కార్యాలయం ప్రారంభం



(మొదటిపేజీ తరువాయి)

కొందరికి గతంలో కౌలు డబ్బులు అందలేదు. ఈ సమస్యలన్నిటిని పరిష్కరించి మొత్తం 495 మందికి రూ.66.48 కోట్ల పెండింగ్ కౌలును సీఆర్డీఏ తాజాగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది.

**గతంలో సమస్యలు-ఇప్పుడు లైన్ క్లియర్**

గతంలో రైతుల బ్యాంకు ఖాతాల అనుసంధానంలో సాంకేతిక లోపాలు తలెత్తాయి. కొందరు రైతులు తమకు కేటాయించిన ప్లాట్లను అమ్మేశారు. అలాగే, మరణించిన రైతుల వారసుల బ్యాంకు ఖాతాల వివరాలు సకాలంలో అధికారులకు చేరలేదు. ఈ కారణాల వల్ల పలువురు రైతుల ఖాతాల్లో 9వ, 10వ, 11వ సంవత్సరాలకు సంబంధించిన వార్షిక కౌలు డబ్బు జమ కాలేదు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించిన ఏపీ సీఆర్డీఏ, పెండింగ్‌లో ఉన్న వార్షిక కౌలును విడుదల చేసింది. అమరావతిలో మొత్తం 495 మంది రైతులకు, భూ యజమానులకు రూ.66,480,402 చెల్లించింది. ఇందులో 9వ, 10వ సంవత్సరాలకు సంబంధించిన కౌలుగా 232 మందికి రూ.4,08,41,632 చెల్లించారు. అలాగే, 11వ సంవత్సరానికి సంబంధించిన కౌలుగా 263 మందికి రూ.2,56,38,770 వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు సీఆర్‌డీఏ కమిషనర్ తెలిపారు. ఈ చెల్లింపులతో రైతులు, భూ యజమానులు తమకు రావాల్సిన డబ్బును అందుకున్నారు. మొత్తానికి డబ్బులు జమ కావడంతో రైతులు ఆనందంలో ఉన్నారు.




## సజ్జనార్‌ను కలిసిన చిరంజీవి
### సీపీగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో శుభాకాంక్షలు

**హైదరాబాద్, మహా:** ప్రముఖ సినీనటుడు చిరంజీవి.. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ సీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సజ్జనార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో సైబరాబాద్ సీపీగా పనిచేసిన సమయంలో, కరోనా సమయంలో ప్లాస్మా దానం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇద్దరూ కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## రైతన్నదే కీలక పాత్ర
### వికసిత్ భారత్ నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు
### పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలి
### ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

**ఢిల్లీ, మహా:** దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్ర



ధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించి.. ఆపై వాటిని పూర్తిగా మరిచిపోయాయని ప్రధాని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వెనకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని ఆశావహ జిల్లాలుగా ప్రకటించినట్లు తెలిపారు.

## ఆంధ్ర, తమిళనాడుకు శ్రీలంక శ్రీరామరక్ష
## నిర్ధారించిన ఇన్కాయిస్


**హైదరాబాద్, మహా:** ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తీర ప్రాంతానికి శ్రీలంక రక్షణ కవచంగా నిలు స్తోందా? అంటే ఔననే అంటున్నారు నిపుణులు. బలమైన రాకాసి అలల తాకిడికి ఏపీ, తమిళనాడు తీర ప్రాంతాలకు నష్టం కలగకుండా శ్రీలంక భూభాగం అడ్డుకుంటున్నట్లు హైదరాబాద్ లోని భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవాకేంద్రం (ఇన్కాయిస్) నిర్ధారించింది. హిందూ మహాసముద్రంలో ఆగ్నేయ దిశగా దూసుకొచ్చే శక్తివంతమైన అలల ప్రభావం ఈ రెండు రాష్ట్రాల తీరాలపై పడకుండా శ్రీలంక భూభాగం నిలువరిస్తున్నట్లు ఇన్కాయిస్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైందని పేర్కొంది. 'భారత ద్వీపకల్పానికి ఆగ్నేయాన ఉన్న శ్రీలంక భూభాగం సహజ భూఅవరోధంగా పనిచేస్తోంది. దక్షిణ మహాసముద్రంలో ఏర్పడే బలమైన అలల విధ్వంస ప్రభావాల నుంచి దేశ ఆగ్నేయ తీరాన్ని రక్షించడంలో భూభాగం కీలక పాత్ర పోషిస్తోంది. వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించే శక్తిమంతమైన అలలు మన దేశ నైరుతి తీరంలోని కేరళపై ప్రభావం చూపుతుండగా, శ్రీలంక భూభాగం ప్రభావంతో వాటి తాకిడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడులపై పడటం లేదు' అని వెల్లడించింది. ఇన్కాయిస్ శాస్త్రవేత్తలు కె.జి. సంధ్య, ఆర్.హరికుమార్, పి. ఎ. ఫ్రాన్సిస్, బాలాజీ బాదురు ఈ పరిశోధనలు చేయగా, మంగళూరు విశ్వవిద్యాలయంలోని మెరైన్ జియాలజీ విభాగం, పుణెలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెట్రోలజీ పరిశోధనల్లో పాలుపంచుకున్నాయి. ఈ పరిశోధన పత్రం జర్నల్ ఆఫ్ ఎర్త్ సిస్టమ్ సైన్స్ లో తాజాగా ప్రచురితమైంది' అని ఇన్కాయిస్ డైరెక్టర్ టి.ఎం.బాలకృష్ణన్ నాయర్ వెల్లడించారు.

**నిర్ధారణ ఇలా...**

కేరళ తీర ప్రాంతం వరదల కారణంగా కోతకు గురవుతుండగా, శ్రీలంకకు ఉత్తరాన ఉన్న తూర్పుతీరంలోని దక్షిణ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ఎక్కువగా ప్రభావితం కాలేదు. బలమైన అలలు బంగాళాఖాతంలోకి వ్యాపించినప్పటికీ.. దేశ ఆగ్నేయ తీరంలో వీటి తీవ్రత అతి తక్కువగా ఉంది. దీన్ని నిర్ధారించడానికి ఇన్కాయిస్ శాస్త్రవేత్తలు పశ్చిమ తీరంలోని కేరళలో కొల్లం, తూర్పు తీరంలోని పాండిచ్చేరిలో హైరెజల్యూషన్ వేవ్ వాచ్9 మోడల్ ను ఉపయోగించి ఆలల తీవ్రత ప్రభావాన్ని విశ్లేషించారు. కొల్లం ప్రాంతంలో వచ్చిన అలలు 96 శాతం కంటే ఎక్కువ పాండిచ్చేరి ప్రాంతానికి చేరుకోలేదని గుర్తించారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సముద్రమట్టం పెరుగుదల తీరప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో శ్రీలంక భూభాగం సహజ రక్షణకవచంగా ఉంటూ తూర్పుతీర ప్రాంతంలో కీలకమైన భూభాగాలపై వ్యతిరేక ప్రభావం పడకుండా చూస్తున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గుడ్ న్యూస్!
### నియామకం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
### సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ జి.చిన్నారెడ్డి లేఖ

**హైదరాబాద్, మహా:** ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ జి.చిన్నారెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. "రాష్ట్రంలో వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే, వారిని ప్రైవేటు ఏజెన్సీలు నియమించడం వల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ప్రైవేటు రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇవ్వడం లేదు. సుమారు 20శాతం వరకు వేతనాల్లో కోత విధించడంతో పాటు.. జీతాలు కూడా ఆలస్యంగా ఇస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం



కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఇటీవల కేబినెట్ తీర్మానం చేసింది. తెలంగాణలో కూడా అదే తరహా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి' అని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో చిన్నారెడ్డి వివరించారు.

## హైకోర్టు స్టేపై సుప్రీంకోర్టుకు అప్పీల్ చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉందన్న ఆయన.. మోదీ బీసీ ప్రధాని అని చెప్పుకునే బీజేపీ నేతలు, బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఎందుకు ఒత్తిడి తీసుకురావటం లేదు? అని ప్రశ్నించారు. ఏపీ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో చేయాల్సింది అంత చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ఉదాసీనత వల్ల జీవో ఇచ్చారని దుయ్యబట్టారు. రాయలసీమను రతనాల సీమ చేస్తా అన్నది కేసీఆర్ కాదా? అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాకా కాంగ్రెస్ అడ్డుకునేందుకు ఫిర్యాదు చేసిందని అన్నారు. తెలంగాణకు దక్కాల్సిన ఒక్క నీటి చుక్కను వదులుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మంత్రుల మధ్య విభేదాలు అన్ని సర్దుబాటు చేసుకుంటామని వివరించారు. ఆర్ఓబి నిర్మాణాల కోసం కేంద్రం నుండి నిధులు రావాల్సి ఉందని.. కేంద్రం నిధులు రాకపోవటం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయని చెప్పుకొచ్చారు

## చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్
### సీఎంగా 15 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు ప్రత్యేక అభినందనలు

(మొదటిపేజీ తరువాయి)

అరుదైన మైలురాయిని పురస్కరించుకుని ప్రధాని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు నాయకుల మధ్య జరిగిన ఈ సంభాషణ వారి మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాన్ని మరోసారి చాటిచెప్పింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ జీవితంలో ఆయన దార్శనికత, సుపరిపాలన పట్ల నిబద్ధత స్థిరంగా కొనసాగాయని ప్రశంసించారు. "2000ల ప్రారంభంలో తామిద్దరం ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటి నుంచి అనేక సందర్భాల్లో కలిసి పనిచేశాం," అని మోదీ గుర్తు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమం కోసం చంద్రబాబు ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఆయనకు అన్నివిధాలా శుభాకాంక్షలు తెలుపుతున్నానని మోదీ అన్నారు. ప్రధాని మోదీ ఫోన్ కాల్, ఆయన తెలిపిన శుభాకాంక్షలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "మీ దార్శనిక నాయకత్వంలో 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించడంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక కీలక శక్తిగా నిలబెడతాం. మీ మద్దతుతో స్వర్ణాంధ్రను నిర్మించేందుకు నేను పూర్తి నిబద్ధతతో ఉన్నాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రధాని మోదీ దయతో కూడిన మాటలకు, ఆయన ఫోన్ కాల్ కు తాను ఎంతో సంతోషిస్తున్నానని పేర్కొన్నారు.

## తెలంగాణ ఐకానిక్‌గా టీస్క్వేర్



(మొదటిపేజీ తరువాయి)

నగరంలోనే ఒక ఐకానిక్ భవనంలా ఉండాలని, అందుకు అనుగుణంగా నిర్మాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. టీస్క్వేర్ ఒక కేంద్రబిందువులా పర్యాటకులను ఆకర్షించడం, రెస్టారెంట్లు, వ్యాపార నిర్వహణ, కార్పొరేట్ వ్యవహారాల వంటి అంశాలు పరిగణలోకి తీసుకుని డిజైన్ రూపొందించాలని చెప్పారు. ఆ ప్రాంతం 24 గంటలూ సందర్శకులను ఆకట్టుకునేలా ఆ ప్రదేశాన్ని తీర్చిదిద్దాలి అని సూచించారు. పెద్ద ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, రంగురంగుల డిజిటల్ ప్రకటనల ద్వారా ప్రపంచ స్థాయి డిజిటల్ డిస్‌ప్లేతో రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. 'యాపిల్ లాంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు సైతం అక్కడ వ్యాపారం నిర్వహించేలా ఉండాలి. పార్కింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాహనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు ఉండాలి. వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు, వాణిజ్య కార్యకలాపాలతో పాటు కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా టీస్క్వేర్ రూపుదిద్దుకోవాలి.. అని చెప్పారు. హైదరాబాద్‌లో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఏఐ ప్రాజెక్టులు, స్టార్టప్‌లు, ఇతర సెంటర్లను ఒకేచోట ఉండే విధంగా ప్రపంచ ఏఐ కంపెనీలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ హబ్‌లతో భాగస్వామ్యం చేసే విధంగా ఈ హబ్ ఉపయోగపడాలని స్పష్టం చేశారు.

# ఈ నెల 14న తెలంగాణ బంద్

## కోర్టు స్టే నిరసిస్తూ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆర్. కృష్ణయ్య వెల్లడి

### బీసీలపై చిన్న చూపు.. మా సత్తా ఏమిటో చూపిస్తామని కామెంట్




**హైదరాబాద్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ ఈ నెల 14న తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆయన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వారు తనకు తెలియజేశారని ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. బీజేపీ నేతలను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, హైకోర్టు స్టేకు నిరసనగా, అలాగే ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరసిస్తూ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చామని అన్నారు. 22 బీసీ సంఘాలు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

నామినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే సమయంలో హైకోర్టు స్టే విధించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. తమ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. బీసీల నోటికాడి ముద్దను లాక్కుంటున్నారని ఆయన విమర్శించారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో బీజేపీతో సహా అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. ఇది బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని ఆయన అన్నారు. వ్యవస్థల మీద, ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడానికే ఈ బంద్ అని స్పష్టం చేశారు. బీసీలను చిన్నచూపు చూస్తున్నారని, అందుకే తమ సత్తా ఏమిటో చూపిస్తామని ఆయన అన్నారు.

# ఇండియాలో ఫస్ట్ ఏఐ ట్రాఫిక్ సిగ్నల్

## ఈ సైరన్స్ విన్నా.. ట్రాఫిక్ ఎటు ఎక్కువ ఉంటే అటు గ్రీన్ సిగ్నల్




**మహా:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ఏదో కొత్త టెక్నాలజీ వచ్చింది.. అందరికీ అందుబాటులోకి రావాలంటే ఇంకా చాలా టైం పడుతుంది.. చూద్దాంలే.. చేద్దాంలే అని ఆలోచన చాలా మందిలో ఉంది. ఇక నుంచి అలాంటి ఆలోచన మానుకోండి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది మన జీవితంలో భాగం అయిపోయింది అనటానికి ఇండియాలోని ఈ ఘటనే ఉదాహరణ. రోడ్డెక్కితే ట్రాఫిక్.. ట్రాఫిక్.. ఇది అందరికీ కామన్. ఇలాంటి ట్రాఫిక్ విభాగంలో ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చేసింది.. ట్రాఫిక్ సిగ్నల్స్ కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏంటీ అంటారా.. అదే ఇప్పుడు మీరు పూర్తి తెలుసుకోబోయే వార్త.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలు పోతాయనే భయం ఉంది కదా.. ఇది నిజం కూడా అవుతుంది..

రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్ పూర్ సిటీ. ఈ నగరంలోని ట్రాఫిక్స్ సిగ్నల్స్ కు AI.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుసంధానం చేశారు. జంక్షన్ దగ్గర అధునాతనమైన కెమెరాలు అమర్చారు. ఈ కెమెరాలు సెన్సార్లతో పని చేస్తాయి. జంక్షన్ చుట్టూ నాలుగు లైన్లు ఉంటాయి కదా.. ఈ నాలుగు లైన్లలోని ట్రాఫిక్ రద్దీని కెమెరాలు చూస్తూ ఉంటాయి. ఎటు వైపు రద్దీ ఎక్కువగా ఉంది అనే సెన్సార్ల ద్వారా గుర్తించి.. అటు వైపు ఆటోమేటిక్ గా గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. ఉదాహరణ గా చెప్పాలంటే.. లెఫ్ట్ సైడ్ ట్రాఫిక్ రద్దీగా ఉంది.. రైట్ సైడ్ ట్రాఫిక్ తక్కువగా ఉంది. మామూలుగా అయితే ట్రాఫిక్ ఎలా ఉన్నా ఆల్టర్ నేట్ గా సిగ్నల్ ఇస్తూ ఉంటుంది ఇప్పుడు ఉన్న సిగ్నల్ వ్యవస్థ. కొత్తగా వచ్చిన AI ట్రాఫిక్ సిగ్నల్స్.. ఇలాంటి ఆటోమేటిక్ సిస్టమ్ కింద పని చేయదు. ఎటు వైపు రద్దీ ఎక్కువగా ఉందో అటు వైపు గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. సో.. జంక్షన్ దగ్గర ఇక నుంచి 30 సెకన్లు.. 60 సెకన్లు.. 90 సెకన్లు అనే టైం డ్యూరేషన్ ఉండదు.. రద్దీ ఎటువైపు ఎక్కువగా ఉంటే అటు వైపు ముందుగా క్లియర్ చేస్తుంది. ఆ తర్వాతనే మిగతా లైన్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. మరి ఎమర్జెన్సీ సర్వీసుల సంగతి ఏంటీ అని డౌట్ రావొచ్చు.. అదేనండీ అంబులెన్స్ లు, అగ్నిమాపక వాహనాలు, పోలీస్ పెట్రోలింగ్ వెహికల్స్ ఇలాంటివి ఏంటీ అంటారా.. ఆయా వాహనాలు ఇచ్చే సైరన్స్.. ఆయా వాహనాలపై ఉండే లైట్లు ఆధారంగా.. ఆటోమేటిక్ గా ఆ లైన్.. ఆ రహదారికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. సో.. నో ప్రాబ్లమ్ అన్నమాట.. రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్ పూర్ సిటీలో.. 2025, అక్టోబర్ 11వ తేదీన ట్రయిల్ రన్ నిర్వహిస్తున్నారు. ఒక్కో జంక్షన్ లో AI ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయటానికి 10 లక్షల రూపాయలు ఖర్చవుతుందని.. ఉదయ్ పూర్ సిటీ ట్రాఫిక్ డీఎస్పీ అశోక్ అంజనా వెల్లడించారు. మరి ఉదయ్ పూర్ వరకు వచ్చిన AI ట్రాఫిక్ సిగ్నల్స్.. మన హైదరాబాద్ సిటీకి రావటం ఎంతోసేపు పట్టదు కదా. ఇలా దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో ఇలాంటి ఏఐ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే రోడ్లపై రద్దీని మెరుగ్గా, సమర్థవంతంగా నిర్వహించటం అధికారులకు కూడా సులభతరం అవుతుంది.

## ఎన్నికల సంఘం తొందరపాటు

# కోట్ల రూపాయల్లో నష్టం

**హైదరాబాద్, మహా:** రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉండగా నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల సంఘంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పథకాల ప్రచారాల ఆనవాళ్లను తొలగింపునకు కోట్ల రూపాయలు వృథా కావడం విమర్శలకు కారణం. ఎన్నికల ప్రక్రియలో భాగమైన ఆర్వోలు, ఏఆర్వోలు, పీవోలకు ఫిబ్రవరిలో రెండుసార్లు, ఇప్పుడు రెండు సార్లు ట్రైనింగ్ ఇచ్చారు అధికారులు. మళ్లీ ఎన్నికలు నిర్వహించినప్పుడు మరొకసారి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని. ఇలా దీనికి కూడా అదనపు ఖర్చు తప్పదని చెబుతున్న అధికారులు.. ఒక్కో మండలంలో నామినేషన్ సెట్ల జిరాక్సులకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టారు. ఈ ఖర్చు రాష్ట్ర వ్యాప్తంగా లెక్కలు వేసుకుంటే రూ.కోట్లలో అవుతుందని చెబుతున్నారు. ఎన్నికలు ఎక్కువ రోజులు వాయిదా పడితే ఓటర్ జాబితా అప్ డేట్ చేసి మళ్లీ అప్పుడు కూడా జీరాక్స్ తీయాల్సి ఉంటుంది. అప్పుడు సైతం అదనపు ఖర్చు తప్పదు. ఇలా అనేక రకాలుగా ప్రజాధనం వృథా అయ్యాయని పలువురు అధికారులు చెబుతున్నారు...

# బాలికల అభ్యున్నతి విద్య ద్వారానే సాధ్యం.!



## బాలిక విద్యను ప్రోత్సహిద్దాం: జె.సి రాజు..

**విజయనగరం జిల్లా,మహా పత్రిక:** బాలికల భవిష్యత్ వారి అభ్యున్నతి విద్యాద్వారానే సాధ్యమని,బాలికలు విద్యావకాశాలు అందిపుచ్చుకునేల వారిని ప్రోత్సహించాలని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు పిలుపునిచ్చారు.అంతర్జాతీయ బాలికల దినోత్సవ నేపథ్యంలో శనివారం ఇందిరమ్మ కాలనీ లో నివాసముంటున్న సంచార జాతుల కుటుంబాలకు చెందిన బాలికలకు,వారి తల్లితండ్రులకు బాలికల చదువు. భవిష్యత్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా బాలిక దినోత్సవ గోడ పత్రికలను ప్రదర్శించారు.చదువుకోవడం పిల్లల హక్కని వారిని చదివించటం తల్లిదండ్రుల బాధ్యతని అన్నారు. స్వాతంత్ర్యం పొందుకొని ఏళ్ళు గడుస్తున్నా ఇంకా పూర్తి స్థాయిలో బాలికలకు చదువు అందటం లేదన్నారు. బాలికలు విద్యావంతులు కాలేక పోతే సమాజం అభివృద్ధి చెందదని అన్నారు. అలాగే సమాజం బాలిక ల హక్కులను పరిరక్షించాలన్నారు,వారిపై లైంగిక వేధింపులు ఆపాలన్నారు.ఆడబిడ్డను పుట్టనిద్దాం, బ్రతకనిద్దాం చదువునిద్దాం అని పిలుపునిచ్చారు. వీరితో పాటు సమాజ సేవకులు జగదీష్,తల్లులు,బాలికలు పాల్గొన్నారు.

# నేటి అవసరాలకు తగ్గట్లు విద్యలో మార్పులు రావాలి

## నైపుణ్యాలకు పెద్ద పీట వేయాలి

- అప్పుడే యువత తమ కాళ్లపై తాము నిలబడగల్లుతుంది
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- భారతీయుల విలువలకు ప్రాధాన్యమివ్వాలని పిలుపు

**హైదరాబాద్, మహా :** ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. నైపుణ్యాలకు పెద్ద పీట వేసేలా పాఠ్యప్రణాళికలను రూపొందించుకోవాలని చెప్పారు. శనివారం బేగంపేట్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ బాలికల కళాశాల 45వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "రోజురోజుకూ సాంకేతికంగా ఎన్నో మార్పులు వస్తున్నాయి. ప్రస్తుతం ఏఐ యుగం నడుస్తోంది. దీనికి తగ్గట్లు పాఠ్యప్రణాళికలు ఉండాలి. బీటెక్ చదివిన చాలా మంది ఉద్యోగ అవకాశాల కోసం కష్టపడుతున్నారు. ఆధునిక అవసరాలకు, ప్రస్తుతం వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పించాలి. యువత చదువు పూర్తికాగానే తమ కాళ్లపై తాము నిలబడగలిగే ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చేలా విద్య ఉండాలి" అని స్పష్టం చేశారు. విద్య అంటే కేవలం పుస్తక పరిజ్ఞానం మాత్రమే కాదని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే గొప్ప సాధనంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్య అనేది సాధికారిత తేవాలని చెప్పారు. భారతీయ విలువలు, సంప్రదాయాలను విద్యలో భాగం చేయాలన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచే కుటుంబ విలువలు నేర్పించాలని సూచించారు. ప్రకృతిని పరిరక్షించాలని, అప్పుడే అది మనల్ని రక్షిస్తుందని చెప్పారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఇంటిలో వండిన తాజా ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మిలెట్లు అనారోగ్యకారకాలపై బులెట్ల వంటివని, వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలని చెప్పారు. శరవేగంగా పరివర్తన చెందుతున్న భారతదేశ ప్రగతి గాథకు యువ మహిళలే రూప శిల్పులని, నూతన భారత నిర్మాణంలో వారు కీలక పాత్ర పోషించాలని శ్రీ వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు., "మీరు కేవలం ఎదుగుతున్న దేశంలోకి కాదు, ప్రపంచ వేదికపై తన స్వరూపాన్ని పునర్నిర్మించుకుంటున్న దేశంలోకి అడుగుపెడుతున్నారు. ఈ చారిత్రక తరుణంలో దేశ పురోగతిలో మీ పాత్ర అత్యంత కీలకం," అని అన్నారు. నేడు అమ్మాయిలు, అబ్బాయిలకన్నా బాగా రాణిస్తున్నారని, ఇది సంతోషించతగిన విషయమని అన్నారు. "మన దేశం నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ. స్టార్టప్‌ల నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు, డిజిటల్ విప్లవం నుంచి హరిత శక్తి వరకు అన్ని రంగాల్లో నూతన శకాన్ని చూస్తున్నాం. 2027 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నాం," అని చెప్పారు. దేశ సమగ్రత, భద్రత విషయంలో నూతన భారత్ దృఢ సంకల్పంతో ఉందని, ఆర్టికల్ 370 రద్దు, ఆపరేషన్ సిందూర్ వంటివి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులు కేవలం డిగ్రీలతో సంతృప్తి పడకుండా, విమర్శనాత్మకంగా ఆలోచించే నైపుణ్యాలను, సృజనాత్మకతను, సానుభూతిని పెంపొందించుకోవాలని సూచించారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో మానవ విలువలే మనల్ని యంత్రాల నుంచి వేరుగా నిలుపుతాయి," అని ఆయన అన్నారు. భారతదేశ గొప్ప వైవిధ్యాన్ని గర్వంగా భావించాలని అన్నారు. సమగ్రత, సమ్మిళితత్వం, సుస్థిరతలను ప్రోత్సహిస్తూ, సమాజానికి తిరిగి సేవ చేయాలని కోరారు. శాంతియుత మార్గమే ప్రగతికి సోపానమని, ఈ విషయాన్ని యువతరం గుర్తుంచుకోవాలని చెప్పారు. అందరితో కలిసిమెలిసి ఉండడాన్ని జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. భారతీయులుగా గర్వించాలని, ఈ గడ్డపై ప్రతిభకు కొరత లేదని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చదువుల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థినులకు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథి ఐపీఎస్ అధికారిణి దీపాలి మాసిర్కర్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాణ్యమైన మద్యంను అందించేందుకు ప్రాధాన్యత

**విజయనగరం జిల్లా,మహా పత్రిక.** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ నిబద్ధతతో పనిచేస్తున్నాయి ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు బొబ్బిలి స్టేషన్ పరిధిలో25 మద్యం షాపులు మరియు03 బార్ల నందు పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించి మద్యం నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించాక అక్కడికక్కడే నమూనాలను పరీక్షించి ఆ తరువాత రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖపట్నంలో గల ఎక్సైజ్ లేబరేటరీ కి పంపించడం జరుగుతుంది. ఇందులో భాగంగా గత అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు 230 నమూనాలను సేకరించి నివేదికలను తెప్పించడం జరిగింది. నివేదికలో ఇచ్చిన వివరాలను బట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సరఫరా చేస్తున్నటువంటి మద్యం పూర్తి నాణ్యత ప్రమాణాలకు లోబడి నాణ్యమైనదిగా ఉన్నట్టుగా వెల్లడైంది.ఇక మీదట కూడా ప్రతి నెల అన్ని షాపుల నందు నమూనాలను సేకరించి పరీక్షించడం ద్వారా మద్యం యొక్క నాణ్యతను తెలుసుకోవడం జరుగుతుంది. వినియోగదారులకు ఎవరికైనా మద్యం నాణ్యతకు సంబంధించిన ఫిర్యాదులు మరియు కల్తీ మద్యం ఎవరైనా తయారుచేసిన,కల్తీ మద్యాన్ని అమ్మిన మాకు ఫిర్యాదు చేయవచ్చు అని అన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ఎమ్మెల్యే బేబీ నాయన

**విజయనగరం జిల్లా,మహా పత్రిక.** బొబ్బిలి నియోజకవర్గంలో ఎప్పటినుంచో ఉన్న రోడ్డు సమస్యలకు పరిష్కారదిశగా బొబ్బిలి శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) కృషి చేస్తున్నారు.అయితే, రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ,పారాది వంతెన పనులు పూర్తికానందున, వర్షా కాలంలో భారీ వాహనాలను అలజంగి,తెర్లాం మీదుగా మళ్ళించవలసి వస్తుందనే కారణంగా,బొబ్బిలి తెర్లాం మరియు బొబ్బిలి పట్టణ రోడ్డు పనులు ప్రారంభించలేదని పలుమార్లు ఎమ్మెల్యే బేబీనాయన గారు పత్రికాముఖంగా తెలుపడం జరిగింది.ఇప్పుడు వర్షాలు తగ్గుముఖం పట్టినందున, ముందుగా బొబ్బిలి తెర్లాం రోడ్డు రేజేరు మీదుగా పనులకు ఈరోజు శాసనసభ్యులు బేబీనాయన శంకుస్థాపన చేయడం జరిగింది. అతి త్వరలో ఎస్.ఏ.ఎస్.సి.ఐ నిధులు రూ4.5 కోట్లతో ఈ రోడ్డు పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం, పినపెంకి ఆకులకట్ట మధ్య రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.ఈ రోడ్డుకు గాను రూ2.9 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపి, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాస్సడర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ,గత ప్రభుత్వ హయాంలో పారాది వంతెన మరమ్మత్తుల సాకుతో అరకొర పనులు చేసి ప్రజాధనాన్ని వృథా చేశారే తప్ప, శాశ్వత పరిష్కారానికి ఏనాడూ ప్రయత్నం చేయలేదని అన్నారు. బొబ్బిలి నియోజకవర్గం ప్రజలకు తాను మాటయిచ్చిన విధంగా, ప్రతి రోడ్డు సమస్యను పరిష్కరిస్తానని, అలాగే, ప్రధాన రహదారుల సమస్య పరిష్కారం అయిన తరువాత, ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేసేలా రోడ్లను నిర్మిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు,బొబ్బిలి మండలం టీడీపీ అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, బాడంగి మండల టీడీపీ అధ్యక్షులు తెంటు రవి, అలజంగి సర్పంచ్ ప్రతినిధి రేజేటి బుజ్జి, టీడీపీ సీనియర్ నాయకులు బడే జానీ,వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు,టీడీపీ నాయకులు, కార్యకర్తలు,ఆర్&బీ అధికారులు పాల్గొన్నారు.



# 16న తెలంగాణ కేబినెట్ సమావేశం

- ఇరిగేషన్ ప్రాజెక్టులు, బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చ
- ఎన్నికల నిర్వహణపై సందిగ్ధ నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత

**హైదరాబాద్, మహా:** ఈ నెల 16న తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించనుంది. కేబినెట్ భేటీలో ఇరిగేషన్ ప్రాజెక్టు, బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించనున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సంధిగ్దం ఏర్పడిన నేపథ్యంలో ఈ కేబినెట్ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. పాత రిజర్వేషన్ల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలపై ముందుకు వెళ్లొచ్చని తెలంగాణ హైకోర్టు గత అర్ధరాత్రి ఆర్డర్ కాపీ విడుదల చేసింది. ఇప్పుడు రాష్ట్రంలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న హైకోర్టు.. 50 శాతానికి రిజర్వేషన్లు మించకుండా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసింది. 42 శాతంలో బీసీలకు 25 శాతం రిజర్వేషన్ కేటాయించి.. మిగతా 17 శాతాన్ని జనరల్ కేటగిరీకి ఇవ్వాలని సూచించింది. అయితే దీనిపై తెలంగాణ ప్రభుత్వం ఇంతవరకూ స్పందించలేదు.

## రాష్ట్ర ప్రభుత్వం తదుపరి నిర్ణయం..

హైకోర్టు ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం తదుపరి నిర్ణయం ఏంటన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తుందన్నవార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ కేబినెట్ కీలక సమావేశం జరపనుంది. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్లు, హైకోర్టు తీర్పుపై కూడా మంత్రివర్గం చర్చించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు స్థానిక ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేయనున్నట్లు తెలుస్తోంది. తాజాగా హైకోర్టు జారీ చేసిన ఆర్డర్ కాపీపై ఎన్నికల సంఘం న్యాయనిపుణులతో చర్చిస్తోంది. న్యాయం నిపుణుల సూచన మేరకు తదుపరి నిర్ణయం తీసుకోనుంది ఎస్ఈసీ.


ఉద్యోగావకాశం..

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

మహా పత్రికకు

(RNI NO: APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM, 95501 59679, 90001 41919

# అందాల బ్యూటీ రాశి ఖన్నా.. రీ ఎంట్రీ ఇవ్వనుందా?

తన పేరులోనే రాశిని పొందుపరచుకున్న నటి రాశిఖన్నా. హీరోయిన్‌గానూ తన రాశి బాగానే ఉంది. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా రేంజ్‌కు ఎదిగిన భామ తమిళంలో ఇమైకా నొడికల్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు. నయనతార ప్రధాన పాత్రను పోషించిన ఈ చిత్రంలో అధర్వ కథానాయకుడిగా నటించారు. ఆ చిత్రం కమర్షియల్‌గా మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత నటి రాశిఖన్నా తమిళంలో కొన్ని చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. రాశి ఖన్నా చివరిగా ధనుశ్, నిత్యామీనన్ జంటగా నటించిన తిరుచిత్రంబలం చిత్రంలో కీలకపాత్రను పోషించారు. ఆ చిత్రం కూడా మంచి విజయాన్ని సాధించింది. అయినా ప్రస్తుతం రాశి ఖన్నా వరుసగా చిత్రాలు చేయడం లేదు. ఆమెకు అవకాశాలు రాకపోవడం లేక ఇతర భాషల్లో నటించడంతో సమయం సరిపోవడం లేదా అనేది తెలియాల్సి ఉంది. అయితే సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉండే ఈ అమ్మడు అవసరమైతే అందాల ఆరబోతకు సై అంటున్నారు. అదేవిధంగా కోలీవుడ్‌లో మంచి చిత్రాల్లో నటించాలన్న కోరికను ఈ బ్యూటీ వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒక ఈవెంట్‌లో పాల్గొన్న రాశిఖన్నా తన భావాలను వ్యక్తం చేస్తూ అభిమానులు ఇష్టపడే కథానాయకగా సినిమాల్లో కొనసాగడం సంతోషంగా ఉందన్నారు. అయితే ఇంకా తన జీవితంలో పెద్ద కల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అంతా మంచే జరుగుతుందని ఆశిస్తున్నట్లు రాశిఖన్నా తెలిపారు





# విజయ్ దేవరకొండ కొత్త సినిమా ప్రారంభం

విజయ్ దేవరకొండ కొత్త సినిమా రౌడీ జనార్దన్ ప్రారంభమైంది. 'రాజా వారు రాణి గారు' సినిమాతో మెప్పించిన క్లాసిక్ డైరెక్టర్ రవికిరణ్ ఇప్పుడు విజయ్‌తో భారీ యాక్షన్ మూవీ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కీర్తి సురేష్ నటిస్తుంది. గతంలో వీరిద్దరు కలిసి మహానటి మూవీలో కలిసి పనిచేశారు. ఇప్పుడు విజయ్‌కు జోడీగా ఆమె నటిస్తున్నారు. గతేడాదిలో కీర్తి పెళ్లి జరిగిన విషయం తెలిసిందే. వివాహం తర్వాత ఆమె చేస్తున్న భారీ చిత్రం ఇదే కావడం విశేషం. ఫ్యామిలీస్టార్ మూవీ తర్వాత నిర్మాత దిల్ రాజు మరోసారి విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్నారు. తాజాగా జరిగిన పూజా కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ కూడా పాల్గొన్నారు. SVC బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో దిల్ రాజు ఈ మూవీని నిర్మిస్తున్నారు. 2026లో ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో విలన్‌గా నటుడు రాజశేఖర్ నటించబోతున్నారని సమాచారం.

# శ్రీలీలకు గోల్డెన్ ఛాన్స్..

## క్రేజీ హీరోతో రెండు సినిమాలు

ఇటీవల అమరన్ చిత్రంతో సంచలన విజయాన్ని అందుకుని మదరాసి చిత్రంతో కమర్షియల్ సక్సెస్‌ను సాధించిన నటుడు శివకార్తికేయన్. ఈయన తాజాగా సుధా కొంగర దర్శకత్వంలో పరాశక్తి చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఇది ఈయన నటిస్తున్న 25వ చిత్రం అన్నది గమనార్హం. నటుడు రవి మోహన్ ప్రతినాయకుడిగా నటిస్తున్న ఇందులో నటుడు అధర్వ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. టాలీవుడ్‌లో క్రేజీ కథానాయకిగా గుర్తింపు పొందిన శ్రీలీల( Sreeleela) కోలీవుడ్ ఎంట్రీకి లైన్ క్లియర్ అయింది. ఈ చిత్రం ద్వారా నేరుగా తమిళ ప్రేక్షకులకు ఆమె పరిచయం అవుతున్నారు. కాగా రాజకీయ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయిన వెంటనే సిబి చక్రవర్తి దర్శకత్వంలో శివకార్తికేయన్ నటించబోతున్నారని సమాచారం. ఇంతకు ముందే వీరిద్దరి కాంబినేషన్‌లో డాన్ వంటి సూపర్ హిట్ చిత్రం రూపొందిందన్నది గమనార్హం. ఈ చిత్రం నవంబర్ నెలలో సెట్స్ పైకి వెళ్లనున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించనున్నారట.టీ మూవీలో కూడా నటి శ్రీలీల కథానాయకిగా నటించనున్నట్లు గట్టిగానే ప్రచారం జరుగుతోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే లేదు. ఇదే గనుక నిజం అయితే ఈ బ్యూటీ బ్యాక్ టు బ్యాక్ శివకార్తికేయన్‌తో సినిమాలు చేసిన హీరోయిన్‌గా గుర్తింపు పొందుతుంది.





# మోదీతో చరణ్ దంపతులు భేటీ..

ప్రధాని నరేంద్ర మోదీని మెగా హీరో రామ్ చరణ్ దంపతులు కలిశారు. ఆయనతో శనివారం భేటీ అయ్యారు. రీసెంట్‌గా ఢిల్లీలో ఆర్చరీ లీగ్ మొదలైంది. ఈ కార్యక్రమాన్ని రామ్ చరణ్ లాంచ్ చేశారు. సదరు లీగ్ సక్సెస్ అయిన సందర్భంగా మోదీని కలిసినట్లు చరణ్ చెప్పుకొచ్చారు. ఈ మేరకు కొన్ని ఫొటోల్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'మన ప్రధానమంత్రిని కలవడం ఎంతో గౌరవంగా అనిపించింది. ఆర్చరీ ప్రీమియర్ లీగ్ వెనుకున్న విజన్‌ని పంచుకోవడం గర్వంగా ఉంది. విలువిద్య మన సాంస్కృతిక వారసత్వంలో ముఖ్యమైన భాగం. ఏపీఎల్ ద్వారా దీన్ని తిరిగి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయాలన్నది మా ఆశయం. భారతదేశంలో అద్భుతమైన ప్రతిభ ఉంది, ఈ వేదిక వాళ్లను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో సహాయపడుతుంది' అని చరణ్ చెప్పుకొచ్చాడు. మన దేశంలో క్రికెట్, కబడ్డీ, ఫుట్ బాల్ తదితర గేమ్స్‌కి లీగ్స్ ఉన్నాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది తొలిసారి ఆర్చరీ(విలువిద్య) లీగ్ పోటీలు నిర్వహించారు. మొత్తంగా ఆరు జట్లు పాల్గొన్నాయి. తెలంగాణ, తమిళనాడు, ఝార్ఖండ్, మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్ టీమ్స్ పోటీ పడ్డాయి.

చరణ్ సినిమాల విషయానికొస్తే.. ఈ ఏడాది సంక్రాంతికి 'గేమ్ ఛేంజర్'తో వచ్చాడు. కానీ ఆకట్టుకోలేకపోయాడు. ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' అనే సినిమా చేస్తున్నాడు. వచ్చే ఏడాది మార్చిలో థియేటర్లలో రిలీజ్ అని చాన్నాళ్ల క్రితమే ప్రకటించారు. అయితే షూటింగ్ ఆలస్యమవుతోంది. వేసవికి వాయిదా పడొచ్చనే రూమర్స్ వినిపిస్తున్నాయి.

# యాక్టింగ్ వద్దట.. ఎంతసేపూ కోహ్లి, రోహిత్ అంటుంటాడు..

స్టార్ సెలబ్రిటీల పిల్లలు యాక్టింగ్ వైపే మొగ్గు చూపుతూ ఉంటారు. అలా సైఫ్ అలీఖాన్) మొదటి భార్య (అమృత సింగ్) పిల్లలు ఇబ్రహీం అలీ ఖాన్, సారా అలీ ఖాన్ కూడా పేరెంట్స్ అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. అయితే సైఫ్ కరీనా కపూర్ పిల్లలు మాత్రం యాక్టింగ్‌పై అంతగా ఆసక్తి చూపించడం లేదట! ఈ విషయాన్ని కరీనా తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించింది.

**యాక్టింగ్ ఇంట్రస్ట్ లేదు**

సైఫ్ అలీఖాన్ సోదరి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌కి కరీనా హాజరైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తైమూర్‌కు యాక్టింగ్‌పై ఏమాత్రం ఆసక్తి లేదు. డ్రామా క్లాసుల్లో జాయిన్ అవుతావా? అని అడిగితే వాడు నో చెప్పేవాడు. ఒకసారి యాక్టింగ్ ట్రై చేసి చూడు అని అడిగితే.. లేదమ్మా, యాక్టింగ్ నేను ఎంజాయ్ చేయలేను అన్నాడు. అందుకే వాడిని నేను బలవంతం చేయదల్చుకోలేదు.

**కోహ్లి బ్యాట్ ఇప్పిస్తావా?**

సైఫ్‌కు వంట చేయడం ఇష్టం. తండ్రిని చూసి వాడు కూడా కుకరీ క్లాస్‌లో జాయిన్ అవుతానన్నాడు. వాడెప్పుడూ నాతోపాటు సెట్స్‌కు రాలేదు. ఏ యాక్టర్‌నూ కలవలేదు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ నీ ఫ్రెండ్సేనా? వాళ్ల బ్యాట్ ఇవ్వమని మెసేజ్ చేస్తావా? లియోనాల్ మెస్సీ ఫోన్ నెంబర్ నీ దగ్గరుందా? ఇలాంటి ప్రశ్నలే అడుగుతుంటాడు. వాళ్లెవరి నెంబర్లూ నా దగ్గర లేవని చెప్పేదాన్ని. వాడికి యాక్టర్స్ గురించి పెద్దగా ఏమీ తెలీదు. ఎంతసేపూ విరాట్‌తో మాట్లాడిస్తావా? అంటూ క్రీడాకారుల గురించే ఆరా తీస్తుంటాడు అని చెప్పుకొచ్చింది.



సైఫ్-కరీనా ఫ్యామిలీ

సైఫ్ కరీనా కపూర్ 2012లో పెళ్లి చేసుకున్నారు. వీరికి 2016లో తైమూర్ జన్మించాడు. 2021లో జహంగీర్ పుట్టాడు. సైఫ్ జంట ఎంత పెద్ద సెలబ్రిటీలైనా సరే.. పిల్లల స్కూల్ ఈవెంట్స్‌కు మాత్రం తప్పక హాజరవుతూ ఉంటారు. తైమూర్‌కు స్పోర్ట్స్ అంటేనే ఇష్టం అని కరీనాయే స్వయంగా చెప్తోంది. మరి జహంగీర్ కూడా అన్నలాగే ఆలోచిస్తాడా? పేరెంట్స్ దారిలో పయనిస్తాడా చూడాలి!

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034